క్లుప్తంగా

బాధితులకు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌ సీపీ సీనియర్‌ నాయకుడు రాజశేఖర్‌ తండ్రి చెంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం సాయంత్రం పచ్చికాపల్లం గ్రామంలో పర్యటించారు. మృతుడు చెంగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ మంత్రి వెంట జెడ్పీటీసీ సుకుమార్‌, పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, యువత మాజీ అధ్యక్షుడు నరేష్‌ రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నాగరాజు, ఎంపీటీసీ భాస్కర్‌, గురవారెడ్డి, సర్పంచ్‌ మార్కొండయ్య తదితరులు ఉన్నారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించారు.

కార్వేటినగరం ఎంపీడీఓగా చంద్రమౌళి



కార్వేటినగరం: మండల అభివృద్ధి అధికారిగా చంద్రమౌళి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్వేటి నగరం ఎంపీడీఓగా వచ్చినట్లు తెలిపారు. నూతన ఎంపీడీఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. మండల పరిషత్‌ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓ చంద్రమౌళిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

పరిపాలన వేధింపులు ఆపండి



నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్‌ సిబ్బంది

నగరి: పరిపాలన వేధింపులు ఆపాలంటూ పోస్టల్‌ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సర్కిల్‌ అడ్మినిస్ట్రేషన్‌ విధించిన అశాస్త్రీయమైన, అవాస్తవ లక్ష్యాలను సాధించడంలో పరిపాలన వేధింపులను ఆపాలన్నారు. డాక్‌ కర్మయోగి పోర్టల్‌ ద్వారా కోర్సులు నేర్చుకునే సమయంలో ఎదుర్కొనే సమయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సౌకర్యాలు కల్పించే వరకు కోర్సులు నేర్చుకోవడంలో వేధింపులు ఉండరాదని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. నగరి ఎస్పీఎం కవిత, పుత్తూరు సబ్‌ డివిజన్‌ బ్రాంచ్‌ సెక్రటరీ మురళి, సిబ్బంది గిరి, కిరణ్‌కుమారి, దినకర్‌, సురేష్‌, కన్నయ్య, నరేష్‌, సురేష్‌, విజయ్‌ చంద్ర, రమేష్‌, సుభాషిణి, మునస్వామి, సత్య, రాజేశ్వరి, కవిత, ప్రేమ్‌, మహానంది పాల్గొన్నారు.

గర్భిణులకు ఐరన్‌ మాత్రలు తప్పనిసరి



ఎగువ తవణంపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా ఐరన్‌ మాత్రలు తప్పక వాడాలని వైద్యాధికారి వినయ్‌కుమార్‌ తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లె, ఎగువ మత్యం గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్‌ వినయ్‌కుమార్‌ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్‌ కేశవ నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని వివరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలో ఉన్నప్పుడే వాటిని అరికట్టాలని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్‌ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: గ్రామాల్లో ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష తెలిపారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్‌ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్‌ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలత, పవిత్ర, రూబి, సరిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా.. నమో నమామి!



దేశమ్మ దేవత, జపశక్తిగా కామాక్షి దేవి, బాలాత్రిపుర సుందరిగా, నాగాలమ్మగా అల్లియల్లమ్మ తల్లి, ఉత్సవ విగ్రహం, కామాక్షమ్మ అవతారంలో శ్రీబంగారమ్మ, అలత్తూరులో ముత్యాలమ్మ, మిద్దినత్తం పడవేటమ్మతల్లి, గిరిరాజా కన్యకా పరమేశ్వరీ, రథంపై చెవిటి గంగమ్మతల్లి

నగరి: జగన్మాతా.. నమో నమామి అంటూ దసరా పర్వం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, కర్పూర సుగంధ పరిమళ ద్రవ్యాల నడుమ శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. మండలంలోని పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దేవతలకు ప్రత్యేక అలంకారాలు చేపట్టారు. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి జపశక్తి అలంకారం చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దర్శించుకున్నారు. పట్టణ పరిధిలోని కరకంతేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి మీనాక్షిగా అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అర్చకులు దుర్గాప్రకాష్‌ మంత్రోచ్చారణ చేయగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, కుంకుమ అర్చన చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. బైపాస్‌ కూడలిలోని ఓంశక్తి ఆలయంలో వేపాకు తోరణాలతో అలంకరించారు. ప్రత్యేక కుంకుమ అర్చన నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పట్టణ పరిధి సత్రం దక్షిణ వీధిలోని వాసవీ



ఓంశక్తి ఆలయంలో భక్తులకు అన్నదానం



పరాశక్తి అలంకారంలో అన్నపూర్ణాదేవి ఊరేగింపు

కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవరాత్రిని పురస్కరించుకొని హోమం, పంచామృతాభిషేకం, మంత్ర పుష్పం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ అమ్మవారికి దీక్షాబంధన అలంకారం చేయగా, మూలవర్లకు ధనాలంకారం చేశారు. ఆలయ కమిటీవారు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీబాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

శ్రీరంగరాజపురం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మూలూరు, పిళ్లారికుప్పం గ్రామాలవారు ఉభయదారులుగా వ్యవహరించారు. అర్చకులు వేకువ జామున అర్చనలు, అభిషేకాలు చేపట్టారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్‌ పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టారు.

నాగాలమ్మ అవతారంలో అల్లి యల్లమ్మ

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీఅల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానం దసరా మహోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం నాగాలమ్మగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం మూలవిరాట్‌ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆనందస్వామి ఆధ్వర్యంలో సురేష్‌రెడ్డి, పెద్దబ్బరెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలకు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నాగాలమ్మ అవతారంలో పల్లకిపై మోస్తూ, పంబ వాయిద్యాలతో నడుమ ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం దాదాపు 500 మందికి రాజేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు గుణశేఖర్‌రెడ్డి, రవీంద్రనాథ్‌ రెడ్డి, గ్రామ సర్పంచ్‌ సుబ్రహ్మణ్యం యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

కామాక్షిదేవిగా శ్రీబంగారమ్మ

కార్వేటినగరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం శ్రీబంగారమ్మ కామాక్షమ్మ దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. అనంతరం ఉభయదారులైన చాముండేశ్వరి, శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో కామాక్షిదేవీ అవతారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్‌ తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథం మొదలియార్‌, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలత్తూరు గ్రామ సమీపంలోని శ్రీముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలతోపాటు, అన్నప్రసాదాలను అందించారు.

ఘనంగా నవరాత్రి మహోత్సవాలు

పాలసముద్రం: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవిటి గంగమ్మ, మిద్దినత్తం పడవేటమ్మ దేవాలయం, మండల సరిహద్దుల్లోని నొచ్చిలి గ్రామంలో వెలసిన గంగాధరేశ్వర స్వామి, పరమేశ్వరీ సమేత గంగాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజు అమ్మవార్లను బాలత్రిపురసుందరిదేవిగా, గిరిరాజ కన్యకా పరమేశ్వరి అలంకరించారు. చెవిటి గంగమ్మ, పడవేటమ్మను బాలత్రిపురసుందరిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు.

పొరపాట్లను ఉపేక్షించేది లేదు





తనిఖీలో కనుగొన్న అంశాలు వివరిస్తున్న ఏపీడీ, బహిరంగ సభకు హాజరైన జనం

- సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో ఏపీడీ ఉమావాణి
- పారదర్శకంగా సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం
- బినామీ మస్టర్లు వేసిన సంఘమిత్ర సస్పెన్షన్

నగరి: ఉపాధి హామీ పనుల్లో పొరపాట్లు ఉంటే ఉపేక్షించే పరిస్థితి లేదని వాటర్‌షెడ్‌ అడిషనల్‌ పీడీ ఉమావాణి అన్నారు. మండలంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులకు రూ.10.58 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులపై గత నెల 23వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో కనుగొన్న అంశాలను బహిర్గతం చేయడానికి శుక్రవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీలో కనుగొన్న అంశాలను పరిశీలించిన అనంతరం ఏపీడీ మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా కందకాల పనులు, చెరువు పూడికతీత పనులు, కాలువ పూడికతీత పనులు, పండ్ల తోటల పెంపకం పనులు జరిగాయన్నారు. ఈ పనుల్లో కొన్ని పంచాయతీలలో మస్టర్లలో వ్యత్యాసాలు, మొక్కలు చనిపోయిన అంశాలు గమనించామన్నారు. తెరణి పంచాయతీలో సంఘమిత్ర, ఎంపీపీ స్కూల్‌లో పనిచేసే స్వీపర్‌కి రూ.25,674 బినామీ మస్టర్లు వేసినట్లు నిర్ధారించి ఆమెను సస్పెండ్‌ చేశామన్నారు. అలాగే కృష్ణా రామాపురం పంచాయతీలో వంద రోజులు పని పూర్తి అయిన కారణంగా ఒకరి పేరుపై మరొకరు పనులు చేసి రూ.68,504 మస్టర్లు వేసి పేమెంట్‌ చేశారని తెలిపారు. ఆ పంచాయతీకి సంబంధించి ఎంక్వయిరీ వేశామన్నారు. చిన్న చిన్న పొరపాట్లకు గాను 10 పంచాయతీలకు సంబంధించి రూ.14,600 పెనాల్టీ వేశామన్నారు. ఇకపై ఉపాధి హామీ పథకంలో పొరపాట్లు జరగకుండా పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమానికి క్లస్టర్‌ ఏపీడీ శోభన్‌ బాబు, జడ్పీటీసీ సభ్యుడు గాంధీ, ఎంపీపీ భార్గవి, వైస్‌ ఎంపీపీ కన్నియప్ప, ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్‌, ఉపాధిహామీ ఏపీఓ కవిత, ప్రజా ప్రతినిధులు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి




ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న మండల అధికారులు, సిబ్బంది

వెదురుకుప్పం: మండల అభివృద్ధి అధికారిగా అమర్నాథ్‌ తన కార్యాలయంలో గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఎర్రావారిపాలెం మండలంలో పనిచేసి, సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఎంపీడీఓ అమర్నాథ్‌కు మండల స్థాయి అధికారులు, డీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం

అడపాదడపా కురుస్తున్న వర్షాలు... గ్రామాల్లో శుభ్రతకు నోచుకోని పరిసరాలు... కాలువల్లో కదలని మురుగనీరు... దోమలకు నిలయంగా మారుతున్న నివాసాలు వెరసి పల్లె జనంపై తీవ్రగా వ్యాధుల ప్రభావం. వ్యాధులు సోకి అది ముదిరి ఇబ్బందులు వచ్చే వరకు అప్రమత్తం కాని జనం. చివరకు ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకున్న తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పందించడం కంటే ముందస్తు చర్యలతో వ్యాధులను దూరం చేసుకోవాలి. ప్రధానంగా ఈ సీజన్‌లో అంటువ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుంది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు మంచం పట్టాల్సిందేనని మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సురేఖ సూచించారు. గ్రామాల్లో ప్రధానంగా విజృంభించే వ్యాధుల తీవ్రత, వాటి నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలు, ముందస్తు చర్యల ద్వారా ఏవిధంగా నివారించాలనే అంశాలకు సంబంధించి ప్రజలను చైతన్య పరుస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు.

– వెదురుకుప్పం





వైద్యాధికారి సురేఖ

- జాగ్రత్తలతో సీజనల్‌ వ్యాధులు దూరం
- దోమల ద్వారానే అంటువ్యాధులు
- డెంగీ వ్యాధి నివారణకు ముందస్తు చర్యలు అవసరం

వాతావరణంలో మార్పులు చేసుకుంటున్న క్రమంలో పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు సోకే అవకాశం ఉంది. ప్రధానంగా దోమల నివారణతోనే వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకునే ఆస్కారం ఉంటుంది. జ్వరం, దగ్గు, జలుబు సాధారణంగా ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉంది. ప్రధానంగా దోమల ప్రభావంతోనే అంటువ్యాధులు వస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. దోమల వలన డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌, మెదడువాపు, చికున్‌ గున్యా వ్యాధులు సోకుతాయి. ఇందులో అతి ప్రధానమైన వ్యాధి డెంగీ. నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు.

అవగాహనతోనే డెంగీ నివారణ

పిల్లలకు వచ్చే జ్వరాలన్నీ డెంగీ జ్వరాలు కావు. జ్వరం వచ్చిన తరువాత ఎలీసా రక్త పరీక్షలు చేసిన తరువాతనే డెంగీ జ్వరంగా గుర్తించాలి. జ్వరాలు వస్తే భయపడాల్సిన అవసరం లేదు. కేవలం అవగాహనతోనే జ్వరాలను నివారించవచ్చు.

జ్వరాలన్నీ డెంగీ కాదు

ఎలీసా రక్త పరీక్షల్లో నిర్ధారణ అయితేనే డెంగీ వ్యాధిగా గుర్తిస్తారు. దానికిమాత్రమే చికిత్సలు అవసరం. మిగతావన్నీ సాధారణ జ్వరాలే. రాత్రి పూట కుట్టే దోమలకంటే పగటి పూట దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ జ్వరాలు దోమలు ఎక్కువగా పగటి పూట మాత్రమే కుడతాయి. ప్రధానంగా పిల్లలకు మాత్రమే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీని కోసం కాళ్లు చేతులు పూర్తిగా దుస్తులు కప్పే విధంగా వాడాలి. డెంగీ జ్వరాలు అన్ని విష జ్వరాలకంటే తీవ్రత అధికంగా ఉంటుంది. జ్వరం వస్తే నుదుటిపై చల్లటి వస్త్రాన్ని ఉంచితే జ్వరాన్ని తగ్గించే అవకాశం ఉంది.

నివారణ మార్గాలు

వర్షాకాలంలో కలుషిత నీటిని తీసుకోవడం ద్వారా జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. రోగాల బారిన పడకుండా ఉండాలంటే బిందె నీళ్లలో క్లోరిన్‌ రెండు వేసుకుని గంట తరువాత వడకట్టుకుని నీటిని తీసుకోవాలి. నివాసాల పక్కల దోమలు వృద్ధి కాకుండా చర్యలు తీసుకోవాలి. వృథాగా ఉన్న పరికరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

డెంగీ వ్యాప్తి

ఏడిస్‌ ఈజిప్టై దోమ కారణంగా డెంగీ వ్యాధి సోకుతుంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటి మీద తెల్లని ఛాయలుంటాయి. అందుకే దీన్ని టైగర్‌ దోమ అని అంటారు. శరీరంలో డెంగీ వైరస్‌ ప్రవేశించిన 7 రోజులు తరువాత దాన్ని మనుషులకు వ్యాపింపజేస్తుంది. ఇది కుట్టినప్పుడు నొప్పి ఉండదు. పగటి పూట మాత్రమే ఎక్కువగా కుడుతుంది. ఈ దోమ శుభ్రమైన నీటితో పాటు కలుషిత నీటితో కూడా వృద్ధి చెందుతోంది.

లక్షణాలు

దోమలు కుట్టిన 7–8 రోజుల తరువాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని స్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పితోపాటు శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు, వికారంగా ఉండడం, రక్తంతో కూడిన మలమూత్ర విసర్జన, కడుపు నొప్పి కూడా ఉంటుంది. రక్తపోటుతోపాటు రక్త కణాల సంఖ్య తగ్గి పోతుంది. కొన్ని సార్లు అవయవాలు వైకల్యం చెంది ప్రాణాపాయం కూడా ఏర్పడుతుంది.

ప్రమాదకరంగా నీవా వంతెన



కూలిపోయిన వంతెన గోడ, (ఇన్‌సెట్‌) నీవానది వంతెనపై ఏర్పడ్డ భారీ గుంత

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని నీవా నది వంతెన దుస్థితికి చేరుకుని ప్రమాదకరంగా మారింది. నీవా వంతెనపై భారీ గుంత ఏర్పడింది. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై వందలాది వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదే దారిలో స్కూళ్లు, కళాశాల వాహనాలు చిత్తూరుకు వెళ్తుంటాయి. అయితే ప్రస్తుతం వంతెనపై ఏర్పడ్డ భారీ గుంత కారణంగా రోడ్డు ప్రమాదాలు తప్పేటట్టు లేవు. వంతెన గోడ గతంలో ఒక వాహనం ఢీకొని ఒకవైపు కూలిపోయింది. ఈ గోడ పూర్తిగా ధ్వంసం కావడంతో గుంతను తప్పించబోయి వంతెన కింద పడిపోయే ప్రమాదం ఉంది. దీనిపై స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

పట్టించుకోని అధికారులు



“ నీవా నది వంతెనపై ఏర్పడ్డ గుంత కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. గతంలో సాధారణ సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు సాధారణ సభ్య సమావేశాలకు హాజరు కావడం లేదు. దీనిపై ఎంపీడీఓ పలుమార్లు నోటీసులు అందించినా స్పందించడం లేదు. జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. త్వరగా రోడ్డు మరమ్మతు పనులు చేయాల్సిందిగా కోరుకుంటున్నా.

– వీసీ సుబ్రహ్మణ్యం యాదవ్‌, సర్పంచ్‌, గంగాధరనెల్లూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గత నెలలో జరిగిన సాధారణ సభ్య సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు మండలంలో చాలా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు మరమ్మతు పనులు చేయాలని, నీవా నది వంతెన గోడ కూలిపోయిన కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని విన్నవించారు. అయితే వినతులు అందించినా ఆర్‌అండ్‌బీ అధికారులు గైర్హాజరు కావడంతో మినిట్స్‌ బుక్‌ రూపంలో వారికి అందించాం. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సమస్యను జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– రాఘవేంద్ర రాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ, గంగాధరనెల్లూరు


దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్‌



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం: మేకల దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను వెదురుకుప్పం పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు... గతంలో మండల పరిధిలో మేకలు, ద్విచక్ర వాహనాల దొంగతనం జరిగింది. తిరుపతి జిల్లా పెరుమాళ్లపల్లె గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు సి.శరత్‌బాబు(29), పెనుమూరు మండలంలోని సుబ్రమణ్యం కుమారుడు చెంచయ్య(42) ఇద్దరు కలిసి దొంగిలించినట్లు నిర్ధారణ అయ్యింది. వారి వద్ద నుంచి 7 మేకలు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.2 లక్షలు విలువ చేస్తాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిందితులను అరెస్టు చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్‌ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అక్రమ మద్యం అరికట్టేందుకు కృషి



శ్రావణ్‌కుమార్‌



ఇన్‌చార్జి ఎక్సైజ్‌ సీఐకి సన్మానం

కార్వేటినగరం: అక్రమ మద్యం వ్యాపారాలను అరికట్టేందుకు నిత్యం కృషి చేస్తానని ఎక్సైజ్‌ ఇన్‌చార్జి సీఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కార్వేటినగరం ఎక్సైజ్‌ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్వేటినగరం ఎక్సైజ్‌ సర్కిల్‌ పరిధిలోని మండలాలు తమిళనాడుకు సరిహద్దుల్లో ఉండడంతో నిత్యం అక్రమ మద్యం రవాణా, సారా తయార, అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అయితే ఎప్పటికప్పుడు నిఘా ఉంచి అలాంటి వ్యాపారాలకు తావు లేకుండా చూస్తానని పేర్కొన్నారు. అక్రమ వ్యాపారాలను అరికట్టడానికి ఎక్సైజ్‌ అధికారులకు గ్రామాల్లో యువత కూడా సహకరించాలని కోరారు. నూతనంగా ఎక్సైజ్‌ సీఐ పదవీ బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను టీడీపీ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఎక్సైజ్‌ ఎస్‌ఐగా శ్రావణ్‌కుమార్‌

ఎక్సైజ్‌ ఎస్‌ఐగా శ్రావస్‌కుమార్‌ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో వైఎస్‌ఆర్‌ కడప జిల్లాలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కార్వేటినగరం వచ్చినట్లు తెలిపారు. మద్యం అమ్మకాలపై దృష్టి పెట్టి నేరాలను అరికట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.